క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి శిబిరం



వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

సామర్లకోట: మాధవపట్నం శివారు జమునానగర్‌లో బాలమందిరం, జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం బుధవారం సాయంత్రం ఉత్సాహంగా కొనసాగింది. జీవన నైపుణ్యాలు అనే అంశంపై చిన్నారులకు అవగాహన తరగతులు నిర్వహించారు. బాలమందిరం కన్వీనర్ అంగర గోపాలకృష్ణ అధ్యక్షతన తోలు బొమ్మలాట నిర్వహించారు. సృజనాత్మక ఆలోచన నైపుణ్యాలపై అద్దేపల్లి ఉదయభాస్కర్ చిన్నారులకు వివరించారు. సమస్యా పరిష్కార నైపుణ్యాలపై దీక్షితుల సుబ్రహ్మణ్యం చక్కని కథలు ఆధారంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. శిబిరంలో చిన్నారులకు సృజనాత్మకమైన, శాస్త్రీయమైన ఆలోచన కలిగి ఉంటూ విజయాలు సాధించాలని అంగర గోపాలకృష్ణ అన్నారు.

రెసిడెన్సీ ప్రారంభం



రెసిడెన్సీని ప్రారంభించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: స్థానిక మఠంసెంటర్‌లో సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్టుమాని శ్రీనివాసరావుకు చెందిన శ్రీలక్ష్మీ హయగ్రీవ రెసిడెన్సీని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ రెసిడెన్సీకి వచ్చే వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, స్థానిక కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ఎంపీడీఓల శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సామర్లకోట: శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఈటీసీ మేనేజరు పి. శ్రీనివాసరావు ఎంపీడీఓలకు సూచించారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఎంపీడీఓలకు బుధవారం ఆయన ఒక రోజు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని బాపట్ల, సామర్లకోట, శ్రీకాళహస్తి ఈటీసీలలో శిక్షణలు ఇస్తున్నట్టు తెలిపారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలపై ఫీల్డు విజిట్ ఉంటుందన్నారు. బుధవారం శిక్షణలో ఫ్యాకల్టీలు వెంకటేశ్వరరావు, ఎస్‌కే మొహిద్దీన్, నిహరిక శిక్షణ ఇచ్చారు.

సీఎం జగన్‌ను కలిసిన జెడ్పీటీసీ



సీఎం జగన్‌తో జెడ్పీటీసీ తులసీకుమార్

పిఠాపురం: కొత్తపల్లి మండల జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ బుధవారం విశాఖపట్నంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

అలరించిన నృత్యప్రదర్శన

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా రత్నగిరి కల్యాణ వేదిక మీద బుధవారం రాత్రి హైదరాబాద్ కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. చిన్నారులు అలేఖ్య, మనస్విని, కీర్తన, హేమ లలిత, దేవి సుహాసిని, వివిధ భక్తి గీతాలకు అద్భుతంగా నృత్యం చేశారు. కళాకారులు, వారి గురువు ఎ.సంజీవబాబులను దేవస్థానం అధికారులు సత్యదేవుని చిత్రపటాలు, స్వామివారి ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

జగ్గంపేట: కాకినాడ జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్టు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జగ్గంపేట జాతీయరహదారిపై బ్లాక్ స్పాట్స్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై అతివేగం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అనంతరం జగ్గంపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అయోమయంలో అన్నదాత

- నీట మునిగిన ధాన్యం రాశులు
- పరిశీలించి సూచనలిచ్చిన అధికారులు



గొంచాలలో తడిసిన పనలను చూపుతున్న అన్నదాత



అచ్చంపేటలో తడిసిన పనలను పరిశీలిస్తున్న ఏఓ సత్య

సామర్లకోట: మూడు రోజులుగా వర్షాలు కురుస్తు ఉండటంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. మండల పరిధిలోని ఉండూరు, పి.వేమవరం, నవర, అచ్చంపేట, గొంచాల, పనసపాడు వీకే రాయపురం వేట్లపాలెం గ్రామంలో రైతుల పంట పొలాల్లో, రోడ్లపై వేసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి.

పశువులకు గడ్డి కోసం పొలంలో ఉంచిన పనలు సైతం నానిపోయాయి. కాగా తడిసిన పనలు, ధాన్యం రాశులను ఎంఏఓ పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. వర్షాలు తగ్గే వరకు కోతలు కోయవద్దని సూచించారు. కోతలు కోసి పనలపై ఉన్న ధాన్యం రంగు మారకుండా లీటరు నీటికి 20 గ్రాముల రాళ్ల ఉప్పు కలిపి పనలపై పిచికారీ చేయాలని సూచించారు. ఈ మేరకు బుధవారం అచ్చంపేట, గొంచాల గ్రామాల్లో వరి పనలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసే విధానాన్ని పరిశీలించారు.

రహజారులు..!



పి.వేమవరానికి వెళ్లే రహదారిలో పేరుకుపోయిన చెత్త

- పి.వేమవరానికి చెత్తతో స్వాగతం
- కంపోస్టు యార్డుగా ప్రధాన రహదారి
- వర్షాలతో వాహన చోదకుల ఆందోళన

సామర్లకోట: మండల పరిధిలో పి.వేమవరం గ్రామానికి వచ్చేవారికి అక్కడి చెత్త స్వాగతం పలుకుతుంది. ఉండూరు–అచ్చంపేట ప్రధాన రహదారి నుంచి గ్రామానికి ఉన్న రహదారి కంపోస్టు యార్డును తలపిస్తోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షపునీరు ఆ చెత్తతో కలసి అధ్వానంగా తయారైంది. గ్రామస్థాయికి స్వచ్ఛ భారత్ నినాదాన్ని తీసుకువెళ్తున్న తరుణంలో ఈ పరిస్థితిపై సమీప గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలకు నిలయంగా..

గ్రామానికి వెళ్లే సింగిల్ రోడ్డు మలుపులతో ఉంటుంది. ఎదురుగా భారీ వాహనం వస్తే తప్పించుకోవడం కష్టంగా ఉంటుంది. ఈ పరిస్థితిలో రహదారి మార్జిన్లలో ఉన్న చెత్త రోడ్డుపైకి వచ్చి వాహనచోదకులు జారిపడే పరిస్థితి నెలకొంది. స్కూల్ బస్సులు వస్తున్న సమయంలో వాటి వేగానికి మరిన్ని ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.

చెత్తను తొలగిస్తాం

గ్రామంలో ఎప్పటి నుంచో ఉన్న కంపోస్టు యార్డు పూర్తిగా చెత్తతో నిండిపోయింది. జేసీబీ సాయంతో కంపోస్టు యార్డులో ఉన్న చెత్తను తొలగిస్తున్నాం. మరో అవకాశం లేక పోవడంతో రోడ్డు మార్జిన్‌లో చెత్తకు నిప్పు పెట్టి మిగిలిన చెత్తను కంపోస్టు యార్డుకు తరలిస్తున్నాం. వర్షాల వల్ల కొద్ది మేర తమ పనులకు అంతరాయం ఏర్పడింది.

– బుల్లియ్య కాపు,
పంచాయతీ కార్యదర్శి, పి.వేమవరం

మత్స్యకారుల సభను విజయవంతం చేయాలి



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: జిల్లా స్థాయిలో ఈ నెల 6న నిర్వహించే మత్స్యకారుల సమ్మేళన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పిలుపునిచ్చారు. మండలంలోని అమినాబాద్ తీర ప్రాంతంలో నిర్మిస్తున్న మేజర్ హార్బర్‌లో నిర్వహించనున్న మత్స్యకారుల సమ్మేళన సభకు బుధవారం ఆయన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మత్స్యకార నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు, మోపిదేవి వెంకట రమణ, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటలకు సభ ప్రారంభమవుతుందని, జిల్లాలోని మత్స్యకారులు అందరూ తరలిరావాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మత్స్యకారులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తీర ప్రాంతంలోని మత్స్యకార గ్రామాల అభివృద్ధికి రూ.కోట్లలో నిధులను కేటాయించారన్నారు. రూ.422 కోట్లతో నిర్మిస్తున్న మేజర్ హార్బర్ నిర్మాణ పనులు 60 శాతం పూర్తయ్యాయన్నారు. ఈ హార్బర్ నిర్మాణంతో మత్స్యకారుల జీవన ప్రమాణాలు పూర్తిగా మారుతాయని, ఈ ప్రాంతం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారులను ఏ మాత్రం పట్టించుకోలేదని, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. వేటనిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు రూ.10 చొప్పున ప్రభుత్వం అందిస్తున్నారు. కార్యక్రమంలో అమినాబాద్ సర్పంచ్ నక్కా మణికంఠబాబు, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, మండల వ్యవసాయ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, మత్స్యకార నాయకులు కంబాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చేపల విక్రయ షెడ్లు



ఉప్పాడలో నిరుపయోగంగా ఉన్న చేపల షెడ్డు



షెడ్డులో తాగిన బాటిల్స్‌ను పగలకొట్టిన దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో నిర్మించిన చేపల విక్రయ దుకాణ షెడ్లు నిరూపయోగంగా మారాయి. ఈ షెడ్లను వ్యాపారులు వినియోగించకపోవడంతో మందు బాబులకు అడ్డాగా మారాయి. స్థానిక చేయూత మహిళా మార్ట్‌కు వచ్చే వారు కూడా ఇబ్బంది పడుతున్నారు. మందుబాబులు తాగిన బాటిల్స్, సీసాలను వదిలివేయడమే కాకుండా బాటిల్స్‌ను బద్దలకొడుతున్నారు. ఈ షెడ్డు నుంచి దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరూపయోగంగా ఉన్న ఈ షెడ్లను వినియోగంలోనికి తీసుకురావాలని కోరుతున్నాడు.

త్వరలో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం



కిర్లంపూడిలో నూతన పోలీస్ స్టేషన్ పనులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

కిర్లంపూడి: గ్రామంలో నిర్మిస్తున్న నూతన పోలీస్ స్టేషన్‌ను త్వరలో ప్రారంభిస్తామని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పక్కన నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. పోలీస్ స్టేషన్‌లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని జగ్గంపేట సీఐ సూర్యఅప్పారావుకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విధుల నిర్వహిస్తున్న పోలీస్ స్టేషన్ శిథిల వ్యవస్థకు చేరుకుందన్నారు. రూ.65 లక్షల సీఎస్ఆర్ నిధులతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని జనవరిలో ప్రారంభించామని, ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మరో 45 రోజుల్లో పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను విజిట్ చేశారు. అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు పాల్గొన్నారు.

ఇటుకల కొరత రానీయొద్దు



గృహనిర్మాణ ప్రగతిని సమీక్షిస్తున్న అదనపు కమిషనర్ నాగనరసింహారావు

- జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- సమీక్షలో ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో గృహ నిర్మాణాలకు ఇటుకల కొరత లేకుండా డిమాండ్‌కు తగిన సరఫరా ఉండేలా కాంట్రాక్టర్లు శ్రద్ధ చూపాలనిని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. బుధవారం కొమరగిరి, పండూరు, ఏపీ త్రయం లేఅవుట్లలో గృహనిర్మాణ ప్రగతిపై హౌసింగ్, మెప్మా, నగరపాలక సంస్థ, ప్రత్యేకాధికారులతో స్థానిక కార్యాలయంలో సమీక్షించారు. కొమరగిరి లే అవుట్‌లోనే సుమారు 5500 గృహాలు గ్రౌండ్ అయ్యి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అక్కడ నిర్మాణాలకు అవసరమైన ఇటుకల సరఫరాలో కొరత కనిపిస్తోందని కాంట్రాక్టర్ సొంతంగా ఇటుకల బట్టీ పరిశ్రమను సమకూర్చుకోవాలని, ఇందుకు లే అవుట్ ప్రాంగణంలో అవసరమైన సహకారాన్ని అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, హౌసింగ్ ఈఈ గుప్త, డీఈ సత్యనారాయణరెడ్డి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలి

కాకినాడ సిటీ: ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా చెత్తను సేకరించేలా చూసే బాధ్యత పారిశుధ్య కార్యదర్శులదేనని ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు స్పష్టం చేశారు. బుధవారం ఆయన 33వ డివిజన్ లచ్చిరాజువారి వీధి, మార్కెట్ ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. బహుళ అంతస్తుల భవనాల్లోని పై అంతస్తుల్లోని వారి నుంచి కూడా చెత్త సేకరించేలా చూడాలని సిబ్బంది ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, సచివాలయ కార్యదర్శులు ఆయన వెంట ఉన్నారు.

కబ్జాలపై విచారణ జరపాలి



తూరంగి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలు, సామాజిక స్థలాలు కబ్జాలకు పాల్పడుతూ వాటిని యథేచ్ఛగా వ్యాపారాలు చేస్తున్నారని తూరంగి ప్రజలు బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తూరంగిలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురౌతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలంటూ వందల సార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్యను పట్టించుకోలేదని ప్రజలు ఆరోపించారు. తూరంగి దందాలపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ సామాజిక స్థలాలను రక్షించాలని సీపీఎం నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సర్వేనంబర్ 217/26లో గల పార్కు స్థలాన్ని కాలనీలో అభివృద్ధి చేయాలని కోరుతున్నామన్నారు. అధికారులు ఈ స్థలాన్ని సర్వే చేసి ఫెన్సింగ్ వేయాలని, పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే తూరంగి ప్రభుత్వ భూముల పరిరక్షణకు, సామాజిక స్థలాల రక్షణకు కలెక్టర్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించండి

అధికారులకు ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశం



వేళంగిలో ధాన్యం రాశులు విడదీయించి ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్న అధికారులు

కరప: ఉపరితల ఆవర్తన ప్రభావంతో మూడు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి, పంటపొలాలను, ధాన్యం రాశులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం జేడీఏ ఎస్.విజయ్‌కుమార్, ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తదితర అధికారులతో ఆయన సమావేశమై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. కోతకు సిద్ధమైన పంటపొలాలు ఏ పరిస్థితిలో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ధాన్యం మొలకలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కళ్లాల్లోని ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశించారు. మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించాలని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక గణనకు తీసుకోనున్నట్టు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, రైతు పండించిన ధాన్యాన్ని సకాలంలో మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

కరప: మండల పరిధిలో రైతులు అప్రమత్తమై ధాన్యం మొలకెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఏఓ ఏవీ రాజేష్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు సూచించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు బుధవారం మండల వ్యవసాయ, రెవెన్యూ అధికారులు కరప, వేములవాడ, వేళంగి, కూరాడ తదితర గ్రామాల్లో పర్యటించి, పంట పొలాలను, కళ్లాల్లోని ధాన్యం రాశులను పరిశీలించి, రైతులకు సూచనలిచ్చారు. పొలాల్లో నీరు నిలబడితే పిల్ల కాలువలు ఏర్పాటు చేసి వర్షంనీరు పోయేలా చేయాలని, కోసిన చేలు పనల మీద ఉన్నా, ధాన్యం రాశులు తడిసిపోయినా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని ఎంఏఓ రాజేష్ సూచించారు.

శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల అందజేత



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేసిన అధికారులు

కొత్తపల్లి: మండలంలోని మూలపేట మహిళా అభివృద్ధి నైపుణ్య శిక్షణ కేంద్రంలో అరబిందో ఫార్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బుధవారం సర్టిఫికెట్లను ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఫౌండేషన్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో 61 మంది శిక్షణ పొందారన్నారు. అరబిందో ఫార్మ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కంప్యూటర్‌పై శిక్షణ, విద్య కేరీర్ ప్లానింగ్‌పై మార్గనిర్దేశాలను అందిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన వారికి ఫౌండేషన్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అరబిందో ఫార్మ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరిలో వేంచేసిన అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన పంచరత్న సుబ్రహ్మణ్యం, దక్షిణ మూర్తి పూర్వక, ఏకశిలా చండీశ్వర నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గత రెండు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దివంగత హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సాయం



విశ్రాంత హోంగార్డుకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: విధి నిర్వహణలో ఉండి మరణించిన హోంగార్డులు గోవిందరాజు, గోవిందు కుటుంబాలకు అందిన ఆర్థిక భరోసాను ఎస్పీ సతీష్‌కుమార్ వారి కుటుంబాలకు అందజేశారు. గోవిందరాజు మరణంతో అందిన బీమా మొత్తం, గోవిందు మరణం నేపథ్యంలో జిల్లా హోంగార్డులు అందించిన ఒక రోజు వేతనం మొత్తాన్ని ఎస్పీ ఈ సందర్భంగా సమకూర్చారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన హోంగార్డు సీడీడీ ప్రసాద్‌కు జిల్లా హోంగార్డులు సమకూర్చిన ఒక రోజు వేతనం మొత్తాన్ని అందించారు.

సామూహిక అత్యాచారం అవాస్తవం

డీఎస్పీ మురళీమోహన్



తుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న దిశా డీఎస్పీ మురళీమోహన్

తుని రూరల్: కోటనందూరు బస్టాండు సమీప మార్కెట్ షెడ్డులో గుర్తు తెలియని యువతిపై సామూహిక అత్యాచారం అవాస్తవమని దిశా డీఎస్పీ సుంకర మురళీమోహన్ తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో తప్పుడు వార్త ప్రచురించడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని ఆయన ఖండించారు. రూరల్ సీఐ సన్యాసిరావు, కోటనందూరు, తుని రూరల్ ఎస్సైలతో కలసి డీఎస్పీ మురళీమోహన్ తుని రూరల్ పోలీస్ స్టేషన్లో విలేకర్లతో మాట్లాడారు. పత్రికలో ప్రచురించినట్టు, పెనుముచ్చు ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియాలో వైరల్ చేసినట్టు యువతిపై అత్యాచారం జరగలేదని తమ విచారణలో స్పష్టమయ్యిందన్నారు. మార్కెట్ షెడ్డులో పడుకుని ఉన్న మహిళ మద్యం తాగి ఉందన్నారు. తనకు వివాహమైందని, భర్త చనిపోయి 12 సంవత్సరాలు అయ్యిందని ఆ మహిళ తెలిపిందన్నారు. 15 ఏళ్ల వయస్సు గల కుమార్తె ఉందని, ఆమెను చూడడానికి కోటనందూరుకు ఆర్టీసీ బస్‌లో వెళుతూ గత నెల 27న మద్యం మత్తులో మార్కెట్ షెడ్డులో పడుకున్నట్టు ఆమె చెప్పిందన్నారు. ఈ క్రమంలో పడుకున్న మహిళ దుస్తులు చెదిరిపోవడంతో స్థానికుల్లో ఒకరు సరిచేసినట్టు తెలిసిందన్నారు. తనపై ఎవరూ అత్యాచారం చేయలేదని, తన మాన మర్యాదలకు భంగం కలిగించి అప్రతిష్టపాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరిందన్నారు. దీనిపై కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ వివరించారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తుని రూరల్, కోటనందూరు ఎస్సైలు ఎ.బాలాజీ, స్వామినాయుడు పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

గోకవరం: మండలంలోని కామరాజుపేట పంచాయతీ శివరామపట్నంలో పేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్ డిమాండ్ చేశారు. మేడే వారోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామరాజుపేట పంచాయతీ పరిధిలో 36 ఎకరాల సీలింగ్ భూమిని దాదాపు 25 సంవత్సరాలుగా సుమారు 76 మంది పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు.